పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - నరసాపురం

కార్తీక మాసంలో నరసాపురం డిపో నుంచి ప్రసిద్ధ క్షేత్రాలైన పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిఎం సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ నెల 26న, నవంబర్ 2, 9, 16వ తేదీల్లో నరసాపురం నుంచి రాత్రి 7 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. పిల్లలకు రూ.720, పెద్దలకు రూ.800, ఎక్స్‌ప్రెస్ సర్వీస్ అయితే పిల్లలకు రూ.900, పెద్దలకు రూ.1200 చొప్పున టిక్కెట్లు ఉంటాయన్నారు. అమరావతి, ద్రాక్షారామం, సామర్లకోట, భీమవరం, పాలకొల్లు లోని క్షేత్రాలను ఒకే రోజు దర్శించుకునే అవకాశం ఉంటుందన్నారు. దీంతో పాటు శబరిమలకు వెళ్లే వారికి సర్వీసులు కూడా నడుపుతామన్నారు. 30 మంది ప్రయాణికులు ఉంటే బస్సును మీ వద్ద నుంచే తీసుకెళ్తుందన్నారు. ద్వారకాతిరుమల, శ్రీశైలం, మహానంది, కాణిపాకం, సిరిపురం, అరుణాచలం, పళని, గురువాయర్, ఎరుమేలి, పంబ, రామేశ్వరం, తిరుపతి, విజయవాడ మీదుగా వెళ్తుందని డిఎం తెలిపారు.

'నిడమర్రు మండలానికి చెందిన వెంకటేశ్వరరావు కౌలు రైతు. మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి సాగు చేసి ఏడాదిపాటు శ్రమించినా పడిన కష్టం కూడా రాలేదు. మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు, పెరిగిన పెట్టుబడులతో అప్పులే మిగులడంతో.. ఎన్నో ఏళ్లుగా ఆ కుటుంబం పడుతున్న బాధలు వర్ణనాతీతంగా మారాయి'.

'ఇరగవరం మండలానికి చెందిన శ్రీనివాస్ అనే రైతు ప్రతియేటా ఐదెకరాల వరకూ కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఏళ్ల తరబడి వ్యవసాయ సాగు చేస్తున్నా ఇప్పటి వరకూ కూడబెట్టింది ఏమీ లేకుండా పోయింది. పిల్లలను మంచి చదువులు సైతం చదవించలేకపోయాడు. ఆరుగాలం కష్టపడినా పెట్టుబడులు రావడమే గగనంగా మారింది. వ్యవసాయ సాగే జీవనాధారంగా చేసుకున్న ఆ కుటుంబం పరిస్థితి నిత్య పోరాటంగా మారింది'.

కౌలు రైతుల కన్నీటి వ్యథ..!

- వరిసాగులో అత్యంత దారుణ పరిస్థితి
- ఆరుగాలం కష్టపడినా మిగులు శూన్యం
- పెట్టుబడి, కౌలుకే పండిన పంటంతా
- అప్పుల ఊబిలో కౌలురైతులు
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న రైతులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌లే కాదు. జిల్లాలోని కౌలురైతుల అందరి పరిస్థితి ఇదేవిధంగా ఉంది. వ్యవసాయాన్ని వదల్లేక, అప్పుల బతుకులతో ముందుకు సాగలేక కౌలురైతులంతా నిత్యం నరకం చూస్తున్నారు. ప్రభుత్వ విధానాలు, ప్రకృతి వైపరీత్యాలతో కౌలురైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఆరుగాలం కష్టపడినా ఫలితం లేకుండాపోతుంది. ఏలూరు పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రతియేటా దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. వ్యవసాయ సాగులో 80 శాతం కౌలురైతులే చేస్తున్నారు. ఆహార ఉత్పత్తిలో ఇంతటి కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నాయి. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. ఏడాదంతా కష్టపడినా మూడు పూటల కడుపు నిండే పరిస్థితి లేదంటే అతిశయోక్తి కాదు. వరిసాగులో అత్యధిక దిగుబడి వచ్చిందనుకుంటే ఖరీఫ్‌లో 40 బస్తాలు, రబీలో 50 బస్తాల వరకూ ఉంటోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 75 కిలోల బస్తా ధర రూ.1,788 వరకూ ఉంది. అంతా సవ్యంగా నడిస్తే ఈ ధర ప్రకారం 40 బస్తాలకు రూ.71,520 ఆదాయం వస్తుంది. ఎకరాకు పెట్టుబడి రూ.45 వేలు వరకూ రైతులు పెడుతున్నారు. డెల్టాలో కౌలు పంటకు 15 నుంచి 17 బస్తాలు ఉంది. ఆ ప్రకారం లెక్కిస్తే రూ.30 వేలు వరకూ కౌలు కిందపోతుంది. కౌలు రూ.30 వేలు, పెట్టుబడి రూ.45 వేలు కలిపితే రూ.75 వేలు అవుతోంది. వచ్చే ఆదాయం మాత్రం రూ.71,520 మాత్రమే. పెట్టుబడి కొంత తగ్గితే అతికష్టంపై ఖర్చులు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు ఏమీ లేకుండా ఉంటేనే ఇదంతా. తుపాన్లు, వరదలు వస్తే రైతులకు ఎకరాకు రూ.20 వేలకుపైగా అప్పులే శరణ్యం. రబీలో రైతు చేసిన సాగులో సరారిన ఎకరాకు 50 బస్తాలు దిగుబడి వస్తోంది. రబీలో ఖర్చు మరింత ఎక్కువగా ఉంటుంది. రబీలోనూ కౌలు, పెట్టుబడి పోను రైతులకు మిగిలేది దాదాపు శూన్యమే. ఒకవేళ ఎకరాకు నాలుగైదు వేలు మిగిలితే ఖరీఫ్‌లో వచ్చిన నష్టానికి సైతం సరిపోని పరిస్థితి ఉంటుంది.

ఏళ్ల తరబడి సాగు చేస్తున్నా మారని కౌలు బతుకులు

రెండు జిల్లాల్లో లక్షలాది మంది రైతులు ఏళ్ల తరబడి కౌలు వ్యవసాయం చేస్తున్నారు. వాళ్ల బతుకులు ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి. మంచి ఇల్లు, పిల్లలకు సరైన చదువులు వంటివి సైతం లేని పరిస్థితులు ఉన్నాయి. అప్పుల బాధలు భరించలేక కౌలురైతులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు కోకొల్లలు. ప్రభుత్వాలు మారుతున్నా కౌలురైతుల బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదు. పెట్టుబడి పెడుతున్న కౌలురైతులకు పంటరుణాలుగాని, బీమా పరిహారంగాని ఏఒక్కటీ అందడం లేదు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి కింద ఏడాదికి ఇచ్చే రూ.ఆరు వేలు, అన్నదాత సుఖీభవ పేరిట రాష్ట్రప్రభుత్వం ఏడాదికి ఇచ్చే రూ.20 వేలుగాని కౌలురైతులకు ఇవ్వడం లేదు. రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ కమిటీ చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. ప్రభుత్వాలు కౌలురైతుల కన్నీటి వ్యథను గురించి ఏమాత్రం ఆలోచించడం లేదు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నాగరాణితోపాటు జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా జిల్లాలో పలు ప్రాంతాల నుంచి ప్రజల నుంచి వచ్చిన 95 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, పిజిఆర్ఎస్‌లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణం పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు సమిష్టిగా పని చేయాలని సూచించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జోరు వర్షం.. స్తంభించిన జనజీవనం

- ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ నాగరాణి సుడిగాలి పర్యటన
- ప్రధాన రోడ్లపై నీళ్లు నిలిచిపోవడంపై అధికారులపై ఆగ్రహం
- డ్రెయిన్లలో చెత్త, అడ్డంకుల తొలగింపునకు చర్యలు
- శాశ్వత చర్యలకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లావ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ జోరు వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. తెల్లవారుజామునే భారీ వర్షం కురిసి కొద్దిసేపు ఆగినా, తర్వాత ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో ఉదయమే కార్యాలయాలకు, విద్యాసంస్థలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులతోపాటు చిరు వ్యాపారులు నానావస్థలు పడ్డారు. రోడ్లన్నీ జలమయం కావడంతో జనం ఇళ్లలోంచి కాలు బయటపెట్టలేని పరిస్థితి ఏర్పడింది. పలు పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. మధ్యాహ్నం నుంచి వర్షం తగ్గడంతో రోడ్లపై జన సంచారం కన్పించింది.

భీమవరం పట్టణంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం రెండు గంటలపాటు సుడిగాలిలా పర్యటించారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నీట మునిగిన పల్లపు ప్రాంతాలను పరిశీలించారు. రజకుల కాలనీ, హౌసింగ్ బోర్డ్, ఇందిరమ్మ నగర్, మెంటేవారితోట, పీపీ రోడ్డు ప్రాంతాల్లో వర్షానికి నీరు చేరిన ప్రాంతాలను పరిశీలించారు. మున్సిపల్ అధికారులకు అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ముంపు సమస్య పునరావృతం కాకుండా శాశ్వత చర్యలకు ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన నీరు చేరిన ప్రాంతాల్లోని డ్రెయిన్లలో చెత్తా చెదారం, అడ్డంకులను తొలగించడంతోపాటు రోడ్లకు ఇరువైపులా మెరక ప్రాంతాలను చదును చేసి నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో ఇటువంటి పరిస్థితి ఎదురు కాకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులు, సిబ్బందిపై ఉందని, సిబ్బంది అందరూ కలిసికట్టుగా పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తాగునీటిని కూడా క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. పిపి రోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంకు, గొడౌన్ల మధ్య జాతీయ రహదారికి ఇరువైపులా నీరు నిలవడం, కొత్తగా వేసిన రోడ్డు కూడా పాడవడంపై కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు వేస్తే సరిపోదని, నీళ్లు నిలిచిపోతే రోడ్లు ఉంటాయా అని ప్రశ్నించారు. కలెక్టర్ వెంట భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ రాంబాబు, మున్సిపల్ ఇంజినీర్ త్రినాథరావు, ఎంహెచ్ఒ సోమశేఖర్, డిఇలు, ఎఇలు ఉన్నారు.

నీట మునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

తాడేపల్లిగూడెం: పట్టణంలో భారీ వర్షం కురిసింది. చిరు వ్యాపారులు దుకాణాలు తెరవలేక అవస్థలు పడ్డారు. లోతట్టు ప్రాంతాలైన కడకట్ల, ఆర్‌టిసి బస్టాండ్, తాలూకా ఆఫీస్ ఆవరణ, మున్సిపల్ కార్యాలయం ఎదురు వీధిలో నీరు నిలిచింది.

కాళ్ల: భారీ వర్షానికి కాళ్లలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ఏలూరుపాడు, జువ్వలపాలెం, కాళ్లకూరు, దొడ్డనపూడి, సీసలి, జక్కరం, కోపల్లె గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కన్పించింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రహదారులపై మోకాళ్ల లోతుపైనే నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఉండిలో నీటమునిగిన పాఠశాల

ఉండి: మండలంలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉండి కాపులపేట, బాలాజీరావుపేట, రాజులపేట, గోరింతోట, గౌడ పేట తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపైకి చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గోరింతోటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నీరు నిలిచిపోయి పాఠశాలలోకి రావడంతో విద్యార్థులను ఉపాధ్యాయిని కాంతమ్మ పక్కనే ఉన్న అంగన్వాడీ కేంద్రంలోకి తరలించారు. పాఠశాల పక్కన మూడు సీసీ రోడ్లను ఎత్తుగా నిర్మించడంతో వర్షపు నీరు పాఠశాలలోకి చేరుతుందని, దీనివల్ల విద్యార్థులు రోగాల బారిన పడతారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆకివీడు: ఎడతెరిపి లేకుండా మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వానలకు పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. ఆకివీడులో జాతీయ రహదారిపై నీరు నిలిచిపోయింది. ఆకివీడులో ఈస్థాయిలో వర్షం కురవడంతో ఈ ఏడాదిలో ఇదే మొదటిసారని అంతా చెబుతున్నారు. ప్రస్తుత వర్షం వరి, ఆక్వాకు తీరని నష్టం చేకూర్చుతుందని రైతులు వాపోతున్నారు. వరి చేలు కొన్ని ఈనిక దశలో ఉండగా, మరికొన్ని ఇప్పటికే ఈనిక పూర్తయ్యి గింజ తయారయ్యే దశలో ఉన్నాయి. ఈనిక దశలో ఉన్న వరి గింజలపై చినుకుపడితే ఇక గింజ తయారవ్వదు. ఇప్పటికే రైతులు ఎకరానికి రూ.30 వేలకుపైగా పెట్టుబడులు పెట్టారని చెబుతున్నారు. ఈ క్రమంలో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

మొగల్తూరు: సోమవారం తెల్లవారుజాము నుండి ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వర్తకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మొగల్తూరు పోలీస్ స్టేషన్ రోడ్డు, పేటపల్లం, గొల్లగూడెం రోడ్డు, కెపిపాలెం, పేరుపాలెం, కాళీపట్నం పడమరలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ శాతం తగ్గకుండా ఉండేందుకు రైతులు నిరంతరం ఏయేటర్లను వినియోగించారు. దీంతో అదనపు భారం పడుతుందని వారు వాపోతున్నారు.

ఆచంట: మండలంలో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు. మండలంలో ఆచంట పెద్దపేట, చినపేట, కొడమంచిలి, మెట్లపాడు, టి.మెరక, కరుగోరుమిల్లి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, తదితర గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

పాలకొల్లు: పాలకొల్లులో సోమవారం ఉదయం వర్షం దంచి కొట్టింది. దీంతో ప్రజల జీవన విధానానికి ఆటంకం ఏర్పడింది. జిల్లాలో రెండో అత్యధిక వర్షపాతం 40 మిల్లీమీటర్లు పాలకొల్లులో నమోదైంది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మొగల్తూరులో..

ఆకివీడు హైస్కూల్‌లో వర్షపు నీటిలోనే విద్యార్థుల రాకపోకలు

15న కేరళ డిజిపికి పౌర సన్మానం

ప్రజాశక్తి - వీరవాసరం

కేరళ డిజిపి రావాడ ఆజాద్ చంద్రశేఖర్‌కు ఈ నెల 15న స్థానిక ఎంఆర్‌కె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పౌరసన్మానం చేయనున్నట్లు వీరవాసరం గ్రామ ప్రముఖులు తెలిపారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వీరవాసరం గ్రామానికి చెందిన రావాడ ఆజాద్ చంద్రశేఖర్ స్థానిక ఎంఆర్‌కె జెడ్‌పి హైస్కూల్‌లోనే విద్య అభ్యసించారని గుర్తు చేశారు. ఐపిఎస్‌గా ఎంపికై ఎస్‌పిగా, డిఐజి, ఐజిగా బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం కేరళ రాష్ట్ర డిజిపిగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఐపిఎస్‌గా గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన చంద్రశేఖర్‌ను విద్యార్థులు, యువత స్ఫూర్తిగా తీసుకోవాలనే ఆకాంక్షతో పౌరసన్మానం చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు ఇదే గ్రామానికి చెందిన మహిళల ఆర్థిక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, మాజీ మంత్రి పీతల సుజాత, విశాఖపట్నం డిప్యూటీ కలెక్టర్ మద్దాల సత్యపద్మ, తుని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వీరవల్లి గోపాలకృష్ణలను కూడా సత్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ డిఎస్‌పి బోను అప్పాజీ, మాజీ సర్పంచి వీరవల్లి రామకృష్ణ, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గుండా రామకృష్ణ, గ్రామస్తులు బాజింకి కృష్ణారావు, ప్రధానోపాధ్యాయుడు జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ డిజిపి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పార్డ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో వీరవాసరం హైస్కూల్ విద్యార్థులకు ఈ నెల 15న ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు సోమవారం తెలిపారు. స్థానిక ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించే చంద్రశేఖర్ పౌర సన్మాన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తారన్నారు. ఈ నేపథ్యంలో ఆ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్‌ను ఆ సంస్థ ప్రతినిధులు కలిసి వివరించారు. ఈ సందర్భంగా సంస్థ కోఆర్డినేటర్ జివివి.ప్రసాద్ మాట్లాడుతూ వీరవాసరం హైస్కూల్లో ఒకప్పటి విద్యార్థిగా ఉన్న చంద్రశేఖర్ ఇప్పుడు భారతదేశంలోనే సంపూర్ణ అక్షరాస్యతతో ఎంతో జ్ఞాన, మేధోసంపత్తి కలిగిన కేరళ రాష్ట్రానికి డిజిపిగా ఉండటం అందరికీ గర్వకారణమన్నారు. అయన స్ఫూర్తితో ఉన్నత శిఖరాలను అధిరోహించి మంచిస్థాయికి ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సేవాసంస్థ 'పార్డ్ ఇండియా' ముందుకొచ్చిందని తెలిపారు. వీరవాసరానికి చెందిన రావాడ ఆజాద్ చంద్రశేఖర్ కేరళ రాష్ట్ర డిజిపిగా అత్యున్నత స్థాయికి చేరిన సందర్భంగా వీరవాసరంలో పౌర సన్మానం జరగనుంది. పార్డ్ ఇండియా జాతీయ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టుదలతో కష్టపడి కాకుండా ఇష్టపడి అవిశ్రాంత కృషితో చదివిన వారు ఏవిధంగా ఉన్నతస్థాయికి వెళ్తారో చంద్రశేఖర్ ఓ ప్రత్యేక ఉదాహరణ అని తెలిపారు. విద్యార్థుల్లో ప్రేరణ కలిగేలా అత్యుత్తమ ప్రతిభ కలిగిన ముగ్గురు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు చంద్రశేఖర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్డ్ ఇండియా ప్రతినిధులు మహ్మద్ ఇలియాజ్ షరీఫ్, సోమశెట్టి వెంకట్రావు, ఇన్‌ఛార్జి ఎస్‌విఎస్‌కె.ప్రసాద్, బోను అప్పాజీ, బాజంకి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కెజి బుక్‌హౌస్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం

కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు (కెజి) బుక్‌హౌస్ ఈ నెల 14వ తేదీ మంగళవారం సాయంత్రం మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ప్రారంభిస్తున్నామని, దీనికి సాహిత్య అభిమానులు, పుస్తక ప్రియులు హాజరు కావాలని ఆ బుక్‌హౌస్ కన్వీనర్ గొట్టుముక్కల రామలింగరాజు (మాస్టారు) తెలిపారు. బుక్‌హౌస్ ప్రారంభానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎంఎల్‌సి, ప్రజాశక్తి పూర్వపు ఎడిటర్ ఎంవిఎస్.శర్మ, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి విచ్చేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బొమ్మిడి నారాయణరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ పిఆర్‌కె.వర్మ, దారి దీపం ఎడిటర్ డివిఎస్.వర్మ, ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం, పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సాహిత్యవేత్తలకు, గొప్ప కవులకు వేదికైన భీమవరం వంటి పట్టణంలో ప్రముఖుల జీవిత చరిత్రలు. అభ్యుదయ, విజ్ఞాన, సైన్స్, విద్య, ఆర్థిక, కళా, సాంస్కృతిక, సామాజిక, వినోద తదితర సమాజ వికాసానికి తోడ్పడే పుస్తకాల నిలయంగా ఈ బుక్‌హౌస్ ఉంటుందని తెలిపారు.

స్వదేశీ వస్తువులను వినియోగించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

స్వదేశీ వస్తువులను ప్రజలు విరివిగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు, ఎంఎస్ఎంఇ ఉత్పత్తులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, ఎస్‌హెచ్‌జి మహిళల ఉత్పత్తుల ప్రదర్శనను కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సంయుక్తంగా తిలకించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాలు, చెక్కతో తయారు చేసిన హస్తకళల ఉత్పత్తులు, ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, పచ్చళ్లు, పూతరేకులు, చిన్న తరహా పరిశ్రమల ఉత్పత్తుల తయారీదారులతో మాట్లాడారు. శివపార్వతి, వరలక్ష్మి ఎస్‌హెచ్ గ్రూపు సభ్యులు తయారు చేసిన పచ్చళ్లు, వివిధ రకాల పూతరేకులు పరిశీలించి రుచి చూశారు. బీట్‌రూట్, క్యారెట్, పాలకూర, మునగాకు, పొన్నగంటి కూర తదితర పదార్థాలతో బెల్లం లేదా కలకండ వినియోగించి పూతరేకులను తయారుచేసి విక్రయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కెపి.శైలజ, జిల్లా హ్యాండ్లూమ్స్ అధికారి ఎ.అప్పారావు, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, మనోజ్ ఉడ్‌వర్క్, కె.ఇల్లింద్రపర్రు, చింతపర్రు సొసైటీ చేనేత వస్త్రాలు, మంచిలి శ్రీ పద్మ పూతరేకులు, కొమరవరం శ్రీ దుర్గా పచ్చళ్ల తయారీదారులు పాల్గొన్నారు.

22 నుంచి కార్తీక మాసం ప్రారంభం

ఈ నెల 22వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుందని, ఈ నేపథ్యంలో దేవాలయాలు శోభాయమానంగా సిద్ధం చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్లో సోమవారం దేవాదయ శాఖ, మున్సిపల్, మెడికల్, పంచాయతీ, మత్స్య శాఖ అధికారులతో కార్తీక మాసం ఏర్పాట్లపై సమీక్షించారు. గునుపూడి సోమేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే రహదారి మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. పేరుపాలెం బీచ్‌లో తగిన భద్రతా ఏర్పాట్లను చేయాలని సూచించారు.

విధుల్లోకి నూతన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మెగా డిఎస్‌సి నిర్వహణలో భాగంగా తాడేపల్లిగూడెం మండలానికి సంబంధించి 18 మంది ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరినట్లు ఎంఇఒ వి.హనుమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మండలానికి సంబంధించి 23 పోస్టులకు గాను 18 మంది నియమించినట్లు ఆయన తెలిపారు. పది రోజుల శిక్షణ అనంతరం వీరు కేటగిరి 3, 4 కింద స్థానిక సంజీవనగర్ క్లస్టర్‌కు 9 మంది, కడకట్ల క్లస్టర్‌కు ఐదుగురు, రూరల్ మండలానికి నలుగురు విధుల్లో చేరినట్లు ఆయన తెలిపారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు, ఎవరైనా సెలవు పెట్టిన పాఠశాలలో వీరి సేవలు ఉపయోగించుకోనున్నట్లు ఎంఇఒ తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు.



కాళ్లలో..

కాళ్ల : మెగా డిఎస్‌సిలో ఎంపికై కాళ్లకూరు హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయురాలుగా అలజంగి రమాదేవి, పిఇటిగా చింత ప్రత్యుష, హిందీ పండిట్‌గా జ్యోతి స్వరూప సోమవారం విధుల్లో చేరారు. కాళ్లకూరు హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎంటి. శ్రీనివాస్ చేతులమీదుగా జాయినింగ్ పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, వారి స్నేహితులు టి.ప్రసన్నకుమార్, రమాదేవి తండ్రి అలజంగి సీతారామయ్య, ప్రత్యుష తల్లిదండ్రులు చింత సత్యనారాయణ, చింత సత్యవేణి అభినందించారు.



నరసాపురం : విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులు

నరసాపురం : డిఎస్‌సిలో విజేతలుగా నిలిచిన నూతన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ-1 పుష్పరాజ్యం, ఎంఇఒ-2 జాన్ ప్రభాకర్‌ను నూతన ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా, ఉత్తమ ప్రమాణాలతో విద్యా బోధన చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల అభిమానాన్ని చూరగొనాలన్నారు. రుస్తుంబాద, లెనిన్ పాఠశాలలకు 10 మంది చొప్పున, మంది టేలర్ పేట పాఠశాలకు 9 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, తూర్పుతాళ్ళ, లెనిన్ పాఠశాలకు ఒక్కో వ్యాయామ ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరినట్లు తెలిపారు.

క్రీడల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నరసాపురం

విద్యతోపాటు క్రీడల్లోనూ తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని నరసాపురం ఆదిత్య పాఠశాల ప్రిన్సిపల్ కర్ణ రాజేష్ అన్నారు. స్థానిక మిషన్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఎస్‌జిఎఫ్ఐ క్రీడా పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు అండర్-14, అండర్-17, బాలబాలికల విభాగాల్లో కబడ్డీలో ఇద్దరు, యోగాలో నలుగురు, లాంగ్‌జంప్‌లో ఒకరు, షాట్‌పుట్‌లో ఒకరు, చదరంగంలో ఇద్దరు విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నామని ఆదిత్య స్కూల్ డైరెక్టర్ ఎన్.శ్రుతిరెడ్డి అన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు కాకిలేటి ప్రసాద్, కుక్కల రవి కుమార్‌లను ప్రశంసించారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ఎన్విరాల్ మెంట్‌కు చేస్తున్న కృషి అభినందనీయమని 316 జిల్లా పూర్వపు గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు పేర్కొన్నారు.డైమండ్స్ లయన్స్ క్లబ్ ఛైర్మన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో స్థానిక లోటస్ ఎన్ క్లేవ్ వద్ద శివాజీ రాజు, సాగి సీతారామరాజు సహకారంతో ప్రకృతి వైపరీత్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి, స్థానికులకు మొక్కలు పంచారు. ఈ సందర్భంగా గట్టిం మాణిక్యాలరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకై డైమండ్స్ లయన్స్ క్లబ్, పేరిచర్ల ఫౌండేషన్లు విశేష కృషి చేస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ వాతావరణ సమతుల్యతకై విరిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఎంఎల్‌శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ ఆలోచనతో కూటమి నాయకులు మున్సిపల్ కమిషనర్ స్వచ్ఛంద సంస్థలు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి గ్రీన్ తాడేపల్లిగూడెంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారని, వారికి అందరూ సహకరించాలి అన్నారు. లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, భావితరాలకు ఆస్తులు అందించకపోయినా కనీస ఆక్సిజన్ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ లయన్ కాళ్ల గోపీకృష్ణ, లయన్ తమ్మాబత్తుల సత్యనారాయణ, కన్నాజీ, మానేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులు త్వరితగతిన ప్రారంభించాలి

ప్రజాశక్తి - తణుకు

వేల్పూరులో జల జీవన్ మిషన్ పనులకు గత ప్రభుత్వం కేటాయించిన నిధులు ఉన్నాయా, పక్కదారి పట్టాయా అనే అనుమానం వస్తోందని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో సిపిఎం బృందం తహశీల్దార్ డివిఎస్ఎస్ అశోకవర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో పైపులైన్లు పునరుద్ధరించి రక్షిత నీటి సరఫరా పథకం అభివృద్ధి చేసి ఇంటింటికీ ఉచిత కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి ప్రజలకు రక్షిత నీరందించేందుకు రూ.274,59 లక్షలు కేటాయించి 2022లో ఆనాటి స్థానిక మంత్రి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన విషయాన్ని

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీరభద్రరావు

వీరభద్రరావు గుర్తు చేశారు. గ్రామంలో కుళాయి కనెక్షన్ కావాల్సిన లబ్ధిదారులు సచివాలయాల వద్ద ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు రూ.100 నగదు చెల్లించి దరఖాస్తు పెట్టుకున్నారని తెలిపారు. అయితే సంవత్సరాలు గడుస్తున్నా 9, 10వ వార్డుతో పాటు కొన్ని ప్రాంతాలకు పైపులైన్లు వేయకపోవడం వల్ల నేటికీ ఇంటింటికీ కుళాయిలు ఇవ్వలేదని తెలిపారు. ఇదే సమస్యను పరిష్కరించాలని గతంలో పంచాయతీ, తహశీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాల ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరినప్పటికీ ఎటువంటి ఫలితం లేదన్నారు. అందుకు సిపిఎం ఆధ్వర్యంలో 4 రోజులపాటు 9, 10 వార్డుల్లో ఇంటింటికి తిరిగి ప్రజల నుండి సంతకాలు సేకరించామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జల జీవన్ మిషన్ పనులు త్వరితగతిన ప్రారంభించి ఇంటింటికి ఉచిత కుళాయిలు వేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 10వ వార్డు కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, కర్ణాటపు నరసింహారావు, తాళ్ల సత్యనారాయణ, వాసా పోసియ్య పాల్గొన్నారు.

ఆక్వా రైతులు లైసెన్సులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఎఫ్‌డిఒ శివరామకృష్ణ

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో ఆక్వా రైతులు ఎపిఎస్ ఎడిఎ చట్టంలో పాత లైసెన్సులు జీవిత కాల పరిమితితో రిజిస్ట్రేషన్ చేసుకోక పోతే ప్రభుత్వం నుండి ఆక్వా విద్యుత్ సబ్సిడీ పథకాలు వర్తించవని మండల ఎఫ్‌డిఒ ఎన్.శివరామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 13,2563 ఎకరాలకు గాను ఇప్పటివరకూ 50,449 ఎకరాలకు మాత్రమే అప్సడాలో లైసెన్సులు పొందినట్లు చెప్పారు. మండలంలో 3000 ఎఎకరాల వరకూ ఆక్వారైతులు అప్సడాలో పేర్లు నమోదు చేసుకోలేదన్నారు. వెంటనే ఆక్వారైతులు స్థానిక సచివాలయంలో విలేజి ఫిషరీస్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేసుకోవాలని, లేకపోతే విద్యుత్ సబ్సిడీ వర్తించదని తెలిపారు. అప్సడా లైసెన్సు లేని రైతులు వెంటనే దరఖాస్తు చేసుకొని లైసెన్సు పొందాలని కోరారు.

చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం అమలు చేయాలని రాష్ట్ర దేవాంగ సేవా సంఘం పొలిటికల్ విభాగం కన్వీనర్ అల్లాడ సూర్య భాస్కరరావు అన్నారు. సోమవారం మార్టేరులో ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని, జిఒ 44ను ఈ ఏడాది మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అయితే ఈ పథకం ఇప్పటి వరకూ అమలు కాలేదని, ఈ నెల కూడా చేనేత కార్మికులకు కరెంటు మీటర్ల ద్వారా రీడింగ్ తీసి, డబ్బులు చెల్లించాలని కరెంటు బిల్లులు ఇచ్చారని తెలిపారు. చేనేత కార్మికులు మండల స్థాయిలో ఉన్న కరెంటు అధికారులను కలిసి కరెంటు బిల్లులు ఇచ్చిన విషయం చెప్పగా, దీనిపై పైఅధికారుల నుంచి ఎలాంటి సమాచారం అందలేదని అంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో చేనేత కార్మికులు ఈ పథకం అమలు కోసం ఎదురుచూస్తున్నారని, ఈ పథకం అమలు చేస్తే చేనేత కుటుంబాల్లో ఆర్థికంగా కొంత భరోసా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలుకు తగు చర్యలు తీసుకోవాలని, వెంటనే దేవాంగ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, సొసైటీలకు ఎన్నికలు జరిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెలుగు సాహితీ సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మున్సిపల్ మాజీ కౌన్సిలర్, అప్పస్మా జిల్లా ఉపాధ్యక్షులు, షిరిడీసాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ జంగా శ్రీనివాస రామరాయ్ ప్రతిష్టాత్మకమైన తాడేపల్లిగూడెం తెలుగు సాహితీ సమాఖ్య అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా తెలుగు పండితులు పసుపులేటి రామచంద్రరావు, కోశాధికారిగా ఆడిటర్ వాసవీ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ నారాయణ వెంకటరమణరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా గట్టిం మాణిక్యాలరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ సమాఖ్య గౌరవాధ్యక్షులు పెద్దలు ఈతకోట భీమశంకర్‌రావు పూర్వాధ్యక్షులు మండా బ్రహ్మాజీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సూపరింటెండెంట్‌కు ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికుల వినతి

ప్రజాశక్తి - తణుకు

ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న కాంటాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ మెడికల్ కాంటాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ పిలుపుమేరకు సోమవారం తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి వరకూ కాంటాక్టు కార్మికులు ప్రదర్శనగా వెళ్లి హాస్పటల్ సూపరింటెండెంట్ వి.సాయికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ కాంటాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ కార్మికుల వేతన బకాయిలు, పిఎఫ్ బకాయిలు తక్షణం చెల్లించాలని, ఇఎస్‌ఐ అమలు చేయాలని, ప్రతి కార్మికునికి రెండు జతలు యూనిఫామ్, పనిముట్లు, సేఫ్టీ గ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ధర్మాని పుష్పలత, పి.రామారావు, టి.భారతి, ఎం.వెంకటలక్ష్మి, పి.విజయలక్ష్మి, డి.ప్రసన్న కుమారి, చోళ్ల మంగమ్మ, వి.సూరమ్మ, డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

గొంది పాఠశాలలో దుండగుల బీభత్సం

తలుపులు, వైఫై రూటర్ బాక్స్ పగలగొట్టిన వైనం

రికార్డులు మాయం

పోలీసులకు హెచ్‌ఎం బేగం ఫిర్యాదు

ప్రజాశక్తి - నరసాపురం

చిందరవందరగా పడేసిన వస్తువులు

మండలంలోని గొంది గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో దుండగుల బీభత్సం సృష్టించారు. శని, అదివారాలు సెలవు కావడంతో స్కూల్ తలుపులు పగలగొట్టి పుస్తకాలు చిందరవందరంగా పడేశారు. పిల్లల కోసం ఉంచిన కోడి గుడ్లు పగలకొట్టి బీభత్సం చేశారు. వైఫై రూటర్ బాక్స్, కొన్ని స్టాంప్స్, రికార్డులు ఎత్తుకుపోయారు. సోమవారం స్కూల్ తెరిచేందుకు వచ్చిన ఆయా తలుపులు తీయగా ఈ విషయాన్ని గుర్తించి హెచ్‌ఎం ఎస్‌కె బేగంకు చెప్పారు. స్కూల్‌కు వచ్చిన హెచ్‌ఎం బేగం పోయిన వస్తువులను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

పిజిఆర్‌ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 21 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరు : రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒక వినతి వచ్చిందని తహశీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. మండలంలోని కెపి.పాలెంనార్త్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన భూమికి సర్వే నిర్వహించి అద్దె నిర్ణయించాలని కోరుతూ వినతి అందించాలని తహశీల్దార్ తెలిపారు. ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ఆచంట

జిఎస్‌టి వల్ల పేదలకు కొంత ఉపశమనం కలిగిందని, ప్రతి ఒక్కరూ జిఎస్‌టిపై అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ బిఎస్ఎస్.కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ కాంపెయిన్‌లో భాగంగా సోమవారం ఎంపిడిఒ కార్యాలయం నుంచి ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం 50 మందితో మండల వ్యాప్తంగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ జిఎస్‌టి రేట్లు తగ్గింపు వల్ల కొన్ని రంగాల్లో చిరు వ్యాపారులు, వినియోగదారులు, జోమాటో, స్విగ్గీ వంటి ఫుడ్ డెలివరీ వర్కర్స్‌కు కలిగే ప్రయోజనాలు, ఇన్సూరెన్స్ ఇతర అంశాలపై సేవా రుసుములు తగ్గింపుతో ప్రజలకు కలిగే అదనపు ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితోపాటు, గిగ్ వర్కర్స్, వ్యాపారులు వినియోగదారులు పాల్గొన్నారు.

గిరిధర్‌కు సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణానికి చెందిన వినికిడి లోపంతో బాధపడుతున్న గిరిధర్ ఇద్దరు పిల్లలకు సిఎం సహాయ నిధి కింద రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని జనసేన కార్యాలయంలో సోమవారం గిరిధర్‌కు విప్ నాయకర్ చెక్కు అందజేశారు. ఇటు మానవత దృక్పథంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ శెట్టిబలిజ ఐక్య సంఘం కూడా వారికి అండగా నిలిచింది. తమవంతు సాయంగా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని కూడిపూడి సత్య, కేతా శెట్టి అందజేశారు. పేదల వైద్యానికి పలు కుల సంఘాలు అండగా నివాలని నాయకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

3 నుంచి సమ్మెకు సమాయత్తం

మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్‌కు కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - తణుకు

సుదీర్ఘకాలంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఎఐటియుసి అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు నవంబరు 3వ తేదీ నుంచి సమ్మెకు సమాయత్తమవుతున్నట్టు ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, తణుకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బొద్దాని నాగరాజు తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ ఆధ్వర్యంలో సోమవారం తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్ కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు, నాగరాజు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరణించిన, రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులను అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని, మున్సిపల్ కార్పోరేషన్ నగర పంచాయతీల్లో పెరుగుతున్న విస్తీర్ణంకు అనుగుణంగా కార్మికుల నిష్పత్తి పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మందుల ముత్తయ్య, కొంబత్తుల రవికుమార్, బంగారు నూకరాజు, గెడ్డం వెంకటేశ్వరరావు, కె.ఆంజనేయులు, బోడపాటి నారాయణ పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి : 9 మంది అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని బియ్యపుతిప్ప శివారు ప్రాంతంలో సోమవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,800 నగదు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ టి.వెంకట సురేశ్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే సీతారామపురం సౌత్ శివారు ప్రాంతంలో ఓ పెంకుటింటిలో పేకాట ఆడుతున్న ఏడుగురుని సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.19,350 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జి.వాసు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మొగల్తూరు : మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి సీతారాంపురం సౌత్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం దాడి చేశామని హెడ్ కానిస్టేబుల్ సుభాని తెలిపారు. డిఎస్‌పి శ్రీవేద అరవింద్ ఆదేశాల మేరకు దాడి చేయగా ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 19,350 నగదును స్వాధీనం చేసుకున్నామని సుభాని తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ప్రజాశక్తి - ఉండి

తనను భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, ఇంటి నుంచి గెంటేశారని సోమవారం ఉండి పోలీస్టేషన్‌లో విజయలక్ష్మి ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం. మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన కొల్లిపర విజయలక్ష్మికి హైదరాబాదులో నివాసం ఉంటున్న మామని ప్రసాద్‌కు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో రూ.రెండు లక్షల నగదు, బంగారు ఆభరణాలు కట్నంగా ఇచ్చారు. కొంతకాలం బాగా ఉన్న వారు విజయలక్ష్మిని మానసికంగాను, శారీరకంగా వేధింపులకు గురి చేయడంతో పాటు అదనపు కట్నం తేవాలంటూ హింసించి ఇంటి నుండి గెంటేశారు. దీంతో చెరుకువాడకు వచ్చిన విజయలక్ష్మి భర్త అత్తమామలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎఎస్‌ఐ మోహన్‌రావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కృష్ణపాలెంలో రోడ్డు ప్రమాదం

13 మంది విద్యార్థులకు స్వల్పగాయాలు

ప్రజాశక్తి - దేవరపల్లి

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 13 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. తాడేపల్లిగూడెంలోని శ్రీ వాసవీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సు ఎప్పటిలానే విద్యార్థులను ఎక్కించుకుని బయలుదేరింది. ఈ బస్సు కృష్ణంపాలెం వద్దకు చేరుకునే సరికి బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో 13 మంది విద్యార్థులకు స్వల్ప

గాయాలయ్యాయి. వీరిని స్థానికులు వెంటనే దేవరపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 50 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. ఈ ప్రమాదంలో బొలెరో వాహన డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్‌ను రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బొలేరో వాహనం నుజ్జునుజ్జయ్యింది. దేవరపల్లి పోలీసులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి - కాళ్ల

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కాళ్ల ఇన్‌ఛార్జి ఎంఇఒ-1 డి.శ్రీనివాసరావు సూచించారు. ప్రభుత్వం మండలానికి నూతనంగా ముగ్గురు ఎస్‌జిటిలు, స్కూల్ అసిస్టెంట్లు 27 మంది ఉపాధ్యాయులను కేటాయించింది. ఈ మేరకు సోమవారం కొత్తపల్లి పాఠశాలలో కొల్లి త్రిమూర్తులు, ఇస్సులంక పాఠశాలలో పోట్నూరి సురేష్, గోగుతిప్ప స్కూల్లో మండల మానవవనరుల భవనంలో ఇన్‌ఛార్జి ఎంఇఒ సమక్షంలో విధుల్లో చేరారు. మరో పలు హైస్కూల్లో 27 మంది స్కూల్ అసిస్టెంట్లు విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పిలు అప్పారావు, ప్రకాష్, వెంకన్నబాబు, లక్ష్మి, బాలాజీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుమంట్ర ఎంపిడిఒగా కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండల ఎంపిడిఒ (ఎఫ్‌ఎసి)గా స్థానిక పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్‌ఎవిఎల్ జె.కృష్ణమూర్తి సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపిడిఒ ఎం.విశ్వప్రసాదరావు అనారోగ్యం కారణంగా దీర్ఘ కాలం సెలవు పెట్టడంతో ప్రభుత్వం కొత్త అధికారిని నియమించింది. కృష్ణమూర్తికి ఇఒపిఆర్‌డి వల్లభు రాంబాబు, కార్యాలయ సిబ్బంది కెఎస్‌ఎన్.శ్రీనివాస్, చింతపల్లి ఉదయ్ కిరణ్ అభినందనలు తెలిపారు.

'టిడిపి నేతల విమర్శలు తగవు'

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర గ్రామ పంచాయతీలో అన్ని అభివృద్ధి పనులకు పంచాయతీలో తీర్మానాలు ఉన్నాయని, అభివృద్ధి జరగకుండా టిడిపి వారు అడ్డుకుంటూ తిరిగి విమర్శలు చేయడం దారుణమని సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, పలువురు వార్డు సభ్యులు అన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో గ్రామస్తుల మధ్య జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రోటోకాల్ పేరు చెప్పి, పంచాయతీ సర్పంచి, ఉప సర్పంచిని సభల్లో అవమానించి, తాము టిడిపి మూడో వార్డు మెంబర్‌కు కుర్చీ వేయలేదనడం సరికాదన్నారు. స్థానిక ఎల్ఏ పాఠశాలలో 3, 4, 5 తరగతి విద్యార్థులను వారి తల్లిదండ్రులకు తెలియకుండా విద్యాశాఖ అధికారుల ద్వారా ఫోర్జరీ తీర్మానాలు చేయించి, కిలోమీటరు దూరంగా, రక్షణ లేని ఊరు చెరువు వద్ద ఉన్న మోడల్ స్కూల్లో విలీనం చేయడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నా ఎంఎల్‌ఎ దాన్ని రాజకీయం చేశారని తెలిపారు. ఎంఎల్‌ఎ, టిడిపి నాయకులు లేని పోని ఆరోపణలు మాని పెనుమంట్ర గ్రామ పంచాయతీ అభివృద్ధిలో తమతో సహకరించాలని కోరారు.

రుజువు చేస్తే పదవికి రాజీనామా చేస్తా : ఉప సర్పంచి

తనపై అసత్య ఆరోపణలు చేసిన టిడిపి నాయకులు వాటిని రుజువు చేస్తే పదవికి రాజీనామా చేస్తానని పెనుమంట్ర గ్రామ ఉప సర్పంచి భూపతి రాజు వెంకట శ్రీనివాసరాజు అన్నారు. గడిచిన 10 సంవత్సరాల నుంచి పంచాయతీ పాలక మండలిలో ఉన్న తాను ప్రజలకు ఉపయోగ పడే పనుల కోసం సొంత నిధులు ఖర్చు చేసిన విషయం గ్రామంలో అందరికీ తెలుసునని తెలిపారు. టిడిపి వారి ఆరోపణల్లో నిజం లేనందు వల్ల గ్రామ సర్పంచి, వార్డు సభ్యులు, గ్రామస్తులు వాస్తవాలు చెప్పడానికి వచ్చారని తెలిపారు.

ఇకెవైసి అయిన వారికే ఉపాధి పనులు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో ఇకెవైసి చేసుకున్న వారికి మాత్రమే ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఎంపిడిఒ ఆర్.విజి శ్రీలక్ష్మి సోమవారం తెలిపారు. ఎంజి ఎన్‌ఆర్‌ఇజిఎస్ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులు స్థానిక పంచాయతీలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల ద్వారా ఇకెవైసి చేయించుకోవాలని చెప్పారు. మండలంలో 11,384 యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నాయన్నారు. అందులో 6,488 జాబ్ కార్డులకు ఇకెవైసి చేసినట్లు తెలిపారు. మిగిలిన 4,896 కార్డుల వారికి ఈ నెల 20వ తేదీలోపు ఇకెవైసి చేయించుకోవాలని చెప్పారు.

విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

ప్రజాశక్తి - ఆచంట

నియోజకవర్గంలో ఎమర్జెన్సీ మెడికల్ షాపుల మాదిరిగా విచ్చలవిడిగా బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారని మాజీ జెడ్‌పిటిసి, వైసిపి సీనియర్ నాయకులు ముప్పాల వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం తూర్పుపాలెంలోని వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో పదివిధికీ బెల్టు షాపులు ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని విమర్శించారు. టిడిపి నాయకులు కూటమి కార్యక్రమం ఏర్పాటు చేసి రాష్ట్రంలో విచ్చలవిడిగా నకిలీ మద్యాన్ని ఎరులై పారిస్తున్నారని ఆరోపించారు. గుడి, బడి తేడా లేకుండా బెల్టు షాపులు ఏర్పాటు చేసి పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ కర్రి వెణుబాబు, సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, పిల్లి రుద్రప్రసాద్, కీర్తి తాతాజీ, గుబ్బల వీరబ్రహ్మం, కొంతొత్తుల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి కేశవ్‌ను కలిసిన రామ్మోహన్‌నాయుడు

నరసాపురం: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను అమరావతిలో సోమవారం నరసాపురానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రికి రామ్మోహన్‌నాయుడు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇరువురు పలు రాజకీయ అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను కొవ్వలి రామ్మోహన్‌నాయుడు కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని కేశవ్ కొవ్వలికి సూచించారు.



మంత్రి కేశవ్‌ను కలిసిన కొవ్వలి

'సమస్యల పరిష్కారానికి కృషి'

నరసాపురం: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు, పింఛన్ల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని మత్స్యకార అభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. సోమవారం మంగళగిరిలో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్‌తో కలిసి గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వైసిపి హయాంలో జరిగిన భూకబ్జాలు, పింఛన్లు తొలగించడంపై వినతులు అందాయి. వీటిని ఆయా మంత్రుల వద్దకు తీసుకెళ్లి పరిష్కరించే దిశగా పని చేస్తామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు.

రాంబాబు, రామకృష్ణకు సత్కారం

మొగల్తూరు: మొగల్తూరులోని అగ్రహారంలో ఉన్న వివేక ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వద్ద లయన్స్ క్లబ్ సభ్యులు యు.రాంబాబు, తణుకు రామకృష్ణను సోమవారం ఘనంగా సత్కరించారు. ఎపిఎన్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా రాంబాబు, హిందూ దేవాలయ పరిరక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షులుగా తణుకు రామకృష్ణ ఎంపిక కావడం పట్ల లయన్స్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడారు. మరిన్ని ఉన్నత పదవులు స్వీకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మొగల్తూరు శాఖ అధ్యక్షులు యు.షారోన్ పుష్ప, లయన్స్ క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ వైద్యుల సిహెచ్.శ్రీనివాసరాజు, లక్కు శేషు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

డ్రెయినేజీలపై ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడులో పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా డ్రెయినేజీలపై నిర్మించిన ఆక్రమ నిర్మాణాల తొలగింపు పనులు సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎ.భీమవరం మలుపు నుంచి కిలోమీటరు వెళ్లేదారిలో ఉన్న ఆక్రమణలను తొలగించారు. సోమవారం మధ్యాహ్నం అధికారులు, పార్టీ నాయకులు ఆక్రమణదారులకు తెలిపారు. ఈ విధమైన అభ్యంతరం లేకుండానే వారు స్వయంగా సహకరించాలని, తొలగింపు ప్రారంభించారు. ఈ మేరకు ఉదయం నుంచి వారు వారి ఆక్రమణలను తొలగించారు. ఈ క్రమంలోనే పట్టణంలో ప్రవేశించే ఇక్కడ 1995 ప్రాంతంలో డ్రెయినేజీపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని తెలిపారు. ఇదే తరహాలో మొత్తం పట్టణంలో గతంలో నిర్మించిన డ్రెయినేజీలపై ఉన్న ఆక్రమణలు తొలగిస్తే మురుగునీటి పారుదల సులభం అవుతుందని అంచనా వేశారు. పూర్తిస్థాయిలో కార్యక్రమం చేపట్టేందుకు అధికారులు ప్రాథమిక సిద్ధం చేస్తున్నారు.

'వారి వ్యాఖ్యల్లో వాస్తవం లేదు'

ప్రజాశక్తి - పెనుమంట్ర

నకిలీ మద్యం సూత్రధారి ముఖ్యమంత్రి చంద్రబాబే అంటూ పెనుమంట్ర జెడ్‌పిటిసి గౌరీ సుభాషిని, వైసిపి రాష్ట్ర మహిళా నాయకురాలు చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదని టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు భూపతిరాజు రాధాదేవి అన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ మద్యం విషయంలో టిడిపి నేత జయ చంద్రారెడ్డి పాత్ర ఉందని తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జయ చంద్రారెడ్డిని వెంటనే టిడిపి నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మొగల్తూరు: మండలంలోని గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైన సంఘటనపై సోమవారం కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కెపి.సుభాన్ తెలిపారు. దీనికి సంబంధించి హెచ్‌సి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం పాఠశాలకు వెళ్లిన బాలిక సాయంత్రమైనా ఇంటికి రాలేదు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సి తెలిపారు.

పేరు మార్పు

చామన ఝాన్సీ (పాతపేరు), భర్త: సత్యనారాయణ గతంలో పిలిచే పేరు **చామన ఝాన్సీ లక్ష్మి** (కొత్తపేరు) డోర్ నెం: 5-79/A, రామాలయం వీధి, పెనుమంచిలి, ఆచంట మండలం, ప॥గో॥జిల్లా, **చామన ఝాన్సీ లక్ష్మి** (కొత్తపేరు) ఇక నుండి (కొత్తపేరు) ను **చామన ఝాన్సీ లక్ష్మి** ను అన్ని వ్యవహారాలలో వ్యవహరించవల్సిందిగా కోరుచున్నాను.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, వల్లూరు గ్రామానికి చెందిన, కుసుమే మహాలక్ష్మి, భర్త : వెంకటేశ్వర్లు అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. నా యొక్క పాస్పోర్ట్ నెంబర్ **W8080840** గల పాస్పోర్ట్ తో వల్లూరు ఇంటి దగ్గర నుండి ఆచంట సెంటర్ కు వెళుతుండగా, నా యొక్క పాస్పోర్ట్ పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

కుసుమే మహాలక్ష్మి
భర్త: వెంకటేశ్వర్లు
కుసుమే వారి పేట, వల్లూరు,
ఆచంట మండలం, ప॥గో॥జిల్లా
సెల్: 95422 53625

డాక్యుమెంట్స్ పోయినవి

మైల విశాలాక్షి అను నేను పశ్చిమగోదావరి జిల్లా, నర్సాపురం పట్టణము నందు ది. 10-08-2021 వ తేదీన, మోటారు సైకిల్ పై వెళుతుండగా ICICI నర్సాపురం, SBI రాయపేట కు చెందిన నా బ్యాంకు పాస్‌బుక్స్ మరియు చెక్‌బుక్స్ (ICICI నెంబర్ 000121-000130, 000110-000120, 000131-000140, SBI నెంబర్ 632060-632080), మరియు నా భర్త మైల రాజమోహన్ రావు గారి సర్వీస్ బుక్ పడిపోయినవి. అవి ఎంత వెతికిననూ దొరకలేదు. నాకు సంబంధించిన బ్యాంకుబుక్స్, చెక్‌బుక్స్ మరియు సర్వీస్ బుక్ దొరికినవారు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు. తగిన పారితోషికం అందించబడుతుంది. వీటిని ఉపయోగించి ఎటువంటి లావాదేవీలు జరిపిననూ, జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

మైల విశాలాక్షి
రుస్తుంబాద, నర్సాపురం,
సెల్ నెం. 80199 53144

పబ్లిక్ నోటీసు

కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కందుకూరు

O.S 60/2018

కాళే రవికుమార్ ....వాది

మరియు

పాలడుగు సుబ్బారావు ఇతరుల 18 ...ప్రతివాదులు

పై తెలిపిన దావాలో **1) బొచ్చు వీరాంజనేయులు (7వ ప్రతివాది),** తండ్రి: మధువైరి, వయస్సు 53 సంవత్సరములు, మేనేజింగ్ డైరెక్టర్ **శ్రీ వీర వివేక క్రియేటివ్ ఆగ్రో ఫారమ్స్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్,** డోర్ నెం.11-67, స్వాంతనాపురం పోస్ట్ & విలేజ్ - 521328 కొనుండవ మండలం, కృష్ణా జిల్లా, **2) ముద్దుల వీర వెంకట నాగ గవర్రాజు (10 వ ప్రతివాది),** తండ్రి: శ్రీనాథ్ బాబు, హిందూ వయస్సు 44 సంవత్సరములు డోర్ నెంబర్.5-267, వెంకటరమణ థియేటర్ వద్ద, కొత్తపేట - 534260 చాగల్లు గ్రామము & మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, **3) ధూళిపాటి గిరిజ (12 వ ప్రతివాది),** భర్త: చావలి వెంకట నాగరాజు వయసు 33 సంవత్సరంలు, రైల్వే కోటర్స్, 801/ 1 వించిపేట - 520002, విజయవాడ కృష్ణా జిల్లా / ఎన్టీఆర్ జిల్లా, **4) ఖాజా శంకర్ రావు (13వ ప్రతివాది),** తండ్రి: సాంబశివరావు, వయసు 56 సంవత్సరంలు, డోర్ నెంబర్1-148, కొలనుకొండ గ్రామము, పిన్ కోడ్ - 522502, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా, **5) సిద్ధినేని అనూష (14వ ప్రతివాది),** భర్త: నరేష్ తేజ్ దీప్, హిందూ వయసు 32 సంవత్సరంలు, డోర్ నెంబర్ 41-21/1-5, మూడవ లైన్, భ్రమరాంబ పురం, కృష్ణలంక, విజయవాడ-520013, కృష్ణాజిల్లా/ఎన్టీఆర్ జిల్లా, **6) కొత్త కీర్తి (15వ ప్రతివాది),** భర్త: సతీష్ బాబు, హిందూ 29 సంవత్సరాలు డోర్ నెంబర్ 67-1-36/9, దర్శిపేట, 2 పటమట, విజయవాడ టౌన్ - 52002, కృష్ణ ఎన్టీఆర్ జిల్లా. **7) ఇరకం జయచంద్ర (17వ ప్రతివాది),** తండ్రి: చంద్రయ్య, హిందూ డోర్ నెంబర్. సి2-124, DRDL కాలనీ, పినాకిని నగర్, సూళ్లూరుపేట పోస్ట్ & విలేజ్ - 524121, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, అనువారు ప్రతివాదులుగా ఉండి కోర్టు నోటీసులు తీసుకొనుటకు నిరాకరించి తప్పుడు సమాచారంతో తిప్పి పంపుతుండగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ పబ్లికేషన్ నోటీసును వేయటం అయినది.

ముఖ్యముగా తెలుపుట ఏమనగా పై డిక్లరేషన్ దావా మీ హాజరు నిమిత్తము **తేది.27-10-2025 గా** కోర్టు వారు వాయిదా వేసి ఉన్నారు. కావున ఆ దినమున 10.30కు మీరు స్వయంగా గాని లేదా లాయర్ ద్వారా గాని హాజరుఅయి సంజాయిషి చెప్పుకొనని యెడల శ్రీ కోర్టు వారు పై దావాను మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఇట్లు :**ముదివర్తి రాజారామ్,**
ఒంగోలు. **ముదివర్తి రాజ్యాలక్ష్మి,** అడ్వకేట్స్,
తేది: 13-10-2025 ఒంగోలు, సెల్ :9440183051

ప్రకటన

మహారాజశ్రీ 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) నూజివీడు వారి కోర్టులో

FDIA No. 100/2024 in O.S.No.44/2022

Between:

వేల్పూరి రమాదేవి వగైరాలు ...పిటిషనర్స్/వాదులు

మరియు

తాడిశెట్టి కోటయ్య @ కోటేశ్వరరావు వగైరాలు ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

To:

R-2: తాడిశెట్టి వెంకన్న, తండ్రి: తాడిశెట్టి కోటయ్య @ కోటేశ్వరరావు, 26 సం॥లు, ఈదర గ్రామం, అగిరిపల్లి మండలం, కృష్ణాజిల్లా (ప్రస్తుత ఏలూరు జిల్లా)

పై నెంబరు గ్రంధంలో పిటీషనర్స్/వాదులు దావా షెడ్యూలు భూములను అయిదు భాగములుగా విభజించి, అందు 2 భాగములను పిటీషనర్స్/వాదులకు కేటాయించ వలసినదిగా శ్రీ కోర్టు వారు ది. 12-04-2022 వ తేదిన ప్రిలిమినరీ డిక్రీని Pass చేసినారు. దర్మిలా సదరు ప్రిలిమినరీ డిక్రీ నిబంధనల ప్రకారం ఫైనల్ డిక్రీ Pass చేయించవలసిందిగా పిటీషనర్స్/వాదులు పై గ్రంధమును దాఖలు చేసినారు. సదరు ఫైనల్ డిక్రీ నోటీసులు మీరు అందుకొనక, కాలయాపన చేయుచున్నందున, ఈ పేపరు ప్రకటన ద్వారా అమలు జరుపమని శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసినందున, మీరు **ది. 27-10-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేక మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేని ఎడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున సదరు కేసును తీర్మానించుదురు.

వాయిదా తేది: 27-10-2025

(కోర్టు వారి order ప్రకారం)

మట్టా విద్యార్థి
కగ్గా ఏడుకొండలరావు
నూజివీడు అడ్వకేట్స్, నూజివీడు
ది. 13-10-2025 సెల్: 93935 11290
63002 65238